క్లుప్తంగా

'రోడ్డుపై వాహనాలు నిలపకుండా చూడాలి'

కాగజ్‌నగర్‌టౌన్: ఎస్పీఎంకు సంబంధించిన భారీ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలుపుతుండడంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ఆనంద్ కుమార్ మంగళవారం పేర్కొన్నారు. పార్కింగ్ చేసిన వాహనాలు సగం వరకు రోడ్డును ఆక్రమించుకోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్పీఎం యాజమాన్యంతో పాటు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే మున్సిపల్, పోలీసు శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఐపీవో సతీశ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ సేవ కేంద్రంలో ఆధార్ నమోదుతో పాటు సవరణ, చిరునామాలు, మార్పులు, డాక్యుమెంట్ సవరణను కూడా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీపీఎంలు రాజేశ్, మల్లికార్జున్, సుధాకర్, సత్యనారాయణ, పోస్టాఫీస్ సిబ్బంది సంతోష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ తనిఖీ

బెజ్జూర్: మండల కేంద్రంలోని తపాలాశాఖ కార్యాలయాన్ని ఐపీవో సతీశ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధిహామీ డబ్బులు, ఆసరా పింఛన్‌లో ఎలాంటి అవకతవకలు జరగకూడదని హెచ్చరించారు. పోస్టాఫీస్ అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పల్లిపట్టీల పంపిణీ

పెంచికల్‌పేట్: సద్గురు మధుసూదన్ 44వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెంచికల్‌పేట్, సంజీవనగర్, బొంబాయిగూడ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సభ్యులు పల్లిపట్టీలు పంపిణీ చేశారు. హెచ్ఎం యాదగిరి, ట్రస్టు సభ్యులు మల్లేషం, రఘువీర్, ఎస్ఎంసీ చైర్మన్ పోషన్న, సేవాదళ్ నర్సింహాచారి, వెంకన్న, గంగారామ్, శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మహాధర్నా' జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట స్టీరింగ్ కమిటీ సభ్యుడు మేడి చరణ్‌దాస్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బాలభారతి పాఠశాల ఆవరణలో తోటి సభ్యులతో కలిసి మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జరిగే మహాధర్నా కార్యక్రమానికి సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

జైనూర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించే మహాధర్నాకు ప్రతీ ఉపాధ్యాయుడు కదలిరావాలని యూఎస్‌పీసీ సంఘం నాయకుడు కనక వెంకటేష్ మంగళవారం అన్నారు. జామిని గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

బెజ్జూర్: విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని వైద్యాధికారి అమన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 48 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్వో అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ దిలీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్: మెడికల్ కళాశాలలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కేశవ్ రావు మాట్లాడుతూ మండలంలోని అంకుసాపూర్ గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న నూతన మెడికల్ కళాశాలలో అటెండర్, వాచ్‌మెన్ పోస్టులకు స్థానికులకే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రేణుక, తారాబాయి, గౌతమి, పల్లవి, లక్ష్మీ, నిర్మల తదితరులు ఉన్నారు.

అందని ద్రాక్షలా పశు వైద్యం

- అందుబాటులో ఉండని ఇన్‌చార్జి వైద్యుడు
- గోపాలమిత్రను ఆశ్రయిస్తున్న పశు పోషకులు
- రెగ్యులర్ పశు వైద్యాధికారిని నియమించాలని వేడుకోలు



పశువులకు వైద్యం అందిస్తున్న గోపాలమిత్ర (ఫైల్)

బెజ్జూర్: మండలంలో పశువులకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. మండలంలో రెగ్యులర్ పశు వైద్యాధికారి లేకపోవడంతో ఇన్‌చార్జిగా ఓ వైద్యుడికి బాధ్యతలు అప్పగించారు. ఆయన ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో సకాలంలో మూగజీవాలకు సరైన వైద్యం అందడం లేదని పశుపోషకులు ఆవేదన చెందుతున్నారు.

పశువుల మృత్యువాత..

పశు పోషకులు, రైతులకు పాడి, పంట రెండు కళ్లలాంటివి. వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉండే పశువులను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. ప్రాణం కన్న ఎక్కువగా ఆశలు పెట్టుకుని కన్న కొడుకులా చూసుకునే పాడి పశువులకు రోగం వస్తే వైద్యం అందని దుస్థితి నెలకొంది. పెద్ద ఎత్తున డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలి పశువులు మృతిచెందుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏటా వర్షాల సమయంలో పశువులు, గొర్రెలు, మేకలు, ఇతర జంతువులు వ్యాధుల బారిన పడుతున్నాయి. పశువులకు జబ్బు సోకినప్పుడు పశు వైద్యశాలలో వైద్యుడు లేక సకాలంలో వైద్యం అందడం లేదు.

రెగ్యులర్ వైద్యుడు లేక అవస్థలు..

మండలంలో రెండేళ్లుగా రెగ్యులర్ పశువైద్యాధికారి లేకపోవడంతో మూగజీవాలకు వైద్యం అందడం లేదు. గతేడాది కాలంగా పెంచికల్‌పేట పశు వైద్యాధికారి రాకేశ్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఆయనకు రెండు మండలాల్లో పశువులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించడం కష్టంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోగాల బారిన పడిన పశువులకు గోపాలమిత్రల వైద్యమే దిక్కవుతోంది. దీంతో పశుపోషణపై ఆధారపడిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 2019 నాటి సర్వే ప్రకారం 23వేల ఆవులు, 6వేల గేదెలు, 10వేల వరకు మేకలు, గొర్రెలు ఉన్నాయి.

గోపాలమిత్ర వైద్యమే దిక్కు..

మండలంలో రెగ్యులర్ పశువైద్యాధికారి లేకపోవడం, ఉన్న ఇన్‌చార్జి వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో పశుపోషకులు, రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. పశువులకు రోగాలు సోకినప్పుడు గోపాలమిత్రను సంప్రదించి వారిచేతనే పశువులకు వైద్యం అందించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పశువులకు వివిధ రకాల జబ్బులు సోకుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాలని కోరుతున్నారు.

పశువులకు వైద్యం అందడం లేదు



మండలంలో పశువులకు మెరుగైన వైద్యం అందడం లేదు. డాక్టర్ అందుబాటులో ఉండటం లేదు. ఆవులు అనారోగ్యానికి గురైతే గోపాలమిత్రను ఆశ్రయిస్తున్నాం. వర్షాకాలం కావడంతో గ్రామంలోని చాలా పశువులు వివిధ రోగాలతో ఇబ్బంది పడుతున్నాయి.

\- ఎం.మహేశ్, కుకుడ

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి



మూగజీవాలకు వైద్యం చేయించడానికి ఇబ్బందులు పడుతున్నాం. మండలంలో పశువైద్యాధికారి లేకపోవడంతో సకాలంలో వైద్యం అందడం లేదు. ఇన్‌చార్జి వైద్యుడున్నా ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి ఉంది. రెగ్యులర్ డాక్టర్‌ను నియమించి మూగజీవాలకు వైద్యం అందేలా చూడాలి.

\- అదే బాపు, సిద్దాపూర్

డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సివిల్ జడ్జి పి.రవి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సిర్పూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జ్ పి.రవి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగంలోని వివిధ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు న్యాయవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి సీలింగ్ ఫ్యాన్లు, పుస్తకాలు అందజేశారు. అనంతరం కళాశాల నుంచి ఇటీవల పీజీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.గణపతి, లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ పి.సతీష్ కుమార్, లోక్ అదాలత్ సభ్యులు జి.కల్యాణ్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ముస్లింలు భారీ సంఖ్యలో జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో వారికి జెడ్పీ వైస్‌చైర్మన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక

రెబ్బెన: మండల కేంద్రంలో మంగళవారం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల కమిటీని ఎన్నుకున్నట్లు నియోజకవర్గ అధ్యక్షుడు ఆడె బాలాజీ, నియోజక వర్గ ఇన్‌చార్జి కనక ప్రభాకర్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా కోట సోమయ్య, ఉపాధ్యక్షులుగా జుమ్మిడి మణిదీప్, ప్రధాన కార్యదర్శిగా ముంజం సంతోష్, కోశాధికారిగా గురుప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్‌రాజు, వెంకటేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తుందని కలెక్టర్ బోర్కడె హేమంత్ సహదేవ్‌రావ్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయనకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కెరమెరి: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని బారెమోడి పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవో సోమయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మయూరి విద్యాలయంలో క్రీడల్లో మెరిసిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి బాక్స్ లంగడి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శాగంటి యాదగిరి, హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్వోపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల కేజీబీవీ ఎస్వో పద్మపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌లు ఫిర్యాదు చేశారు. ఎస్వో తన విధులకు సక్రమంగా హాజరు కాకుండా ఉపాధ్యాయుల మధ్య గ్రూపు తగాదాలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల పట్ల దురుసు ప్రవర్తన, విద్యార్థులతో పనులు చేయించటం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎస్వోపై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరారు.

పూలాజీ బాబా అడుగుజాడల్లో నడవాలి

జైనూర్: ప్రతి ఒక్కరూ పూలాజీ బాబా అడుగుజాడల్లో నడవాలని సిద్ధేశ్వర సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగిళే అన్నారు. మంగళవారం మండలంలోని పట్నాపూర్‌లో సంస్థాన్ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాబా ప్రవచనాలతో ఎంతో మంది భక్తుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. నేడు నిర్వహించే బాబా 99వ జన్మదిన వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై సందీప్‌కుమార్, సంస్థాన్ ఉపాధ్యక్షుడు వామన్ ఇంగిళే తదితరులు ఉన్నారు.

సీనియర్ సిటిజన్ల కార్యవర్గ సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం జూమ్ మీటింగ్ ద్వారా నిర్వహించారు. ఈ జూమ్ మీటింగ్‌లో అన్ని జిల్లాల నుంచి సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు మాట్లాడుతూ మెడికల్ సౌకర్యాలు ఉపయోగించుకోవాలని సూచించారు. వేధింపులకు గురిచేస్తే వెంటనే ఆర్డీవో, తహసీల్దార్‌ను సంప్రదించాలన్నారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోపోతే ఇచ్చిన ఆస్తిని తిరిగి తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మూర్తి సత్యనారాయణ, కె.రమణయ్య, పి.దేవయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 2వ ఏఎన్ఎంల సమ్మె

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్యారోగ్యశాఖ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 2వ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని 14 రోజులుగా చేస్తున్న సమ్మె మంగళవారం కొనసాగింది. సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి నిమ్మకు నీరెత్తినట్లు లేదని, సమస్య పరిష్కరించేంత వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ తెలిపారు. 2వ ఏఎన్ఎంల సమ్మెకు జిల్లా టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. టీడీపీ నాయకులు మల్లిఖార్జున్, పోలకర్ సాయిరాం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఏఎన్ఎంల యూనియన్ నాయకురాలు వసంత, సంతోషి, పుణ్యవతి, రజని, భాగ్య, భూదేవి, ప్రమీల, సునీత, తిరుమల, రాజేశ్వరి ఉన్నారు.

జెండాగూడకు బీటీ రోడ్డు మంజూరు

రెబ్బెన: మండలంలోని మాద్వాయిగూడ నుంచి జెండాగూడ వరకు ప్రభుత్వం రూ.1.8 కోట్ల వ్యయంతో నాలుగు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు మంజూరు చేసింది. గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని గతంలో జెండాగూడ, పాత మాద్వాయిగూడ గ్రామస్తులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేయగా ఎమ్మెల్యే రోడ్డు మంజూరు చేయించారు.

రక్తదానంతో ప్రాణదానం

జైనూర్: రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడిన వారమవుతామని ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆడ వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి అశోక్, బీఆర్ఎస్ నాయకులు జన్నావార్ పవన్, నాలం సాయి, పోతు దేవేందర్, భారతి గ్రామర్ పాఠశాల కరస్పాండెంట్ పాలిపెల్లి నరేందర్ ఉన్నారు.

జాతీయ క్రీడా వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రెబ్బెన: లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్: వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో) సంఘం జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదికలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శోభన్, కార్యదర్శిగా రవితేజ, కోశాధికారిగా శంకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా టీఎస్‌జీవో అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి కరుణ, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డు వైద్య సేవలు!



సెలైన్ మార్చుతున్న సెక్యూరిటీ గార్డు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి 8.30 గంటలకు వైద్యులు, నర్సులు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రిలో పని చేసే సెక్యూరిటీ గార్డు జ్వరంతో చికిత్స పొందుతున్న మహిళలకు సెలైన్ మార్చుతూ కన్పించాడు. జనరల్ వార్డులో నర్సులు ఎవరూ ఆ సమయంలో అందుబాటులో లేకపోవడం గమనార్హం.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాఖీ వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రాఖీ వేడకలు నిర్వహించారు. బాలికలు బాలురకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. షీటీం సభ్యులు సునీత, శ్రీలత, స్వప్న, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ కుమార్ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నాయకులు ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో మంగళవారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థినులతో రాఖీలు కట్టించి సోదర భావాన్ని విద్యార్థుల్లో పెంపొందించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రమేశ్, నాయకులు రాజేష్, శ్రీనివాస్, మహేశ్, రోహిత్, అనిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

తేనె శుద్ధి కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



తేనె శుద్ధి యంత్రాలు పరిశీలిస్తున్న దీపక్ తివారి

వాంకిడి: మండల కేంద్రంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తేనె శుద్ధి కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి మంగళవారం డీఆర్‌డీవో సురేందర్, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. తేనె శుద్ధి చేసే యంత్రాలను పరిశీలించారు. తేనె తయారీ, సేకరణ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన తేనెను మార్కెటింగ్ చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను ఐకేపీ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట డీపీఎం సారయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఏఈ స్టీవెన్, ఏపీఎం మహేశ్ తదితరులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం మండలంలో సాలేగూడ మిల్లెట్ బిస్కెట్ తయారీ పరిశ్రమను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో సురేందర్, డీపీఎం రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'దళితబంధు'పై హరీశ్‌బాబు ఆరోపణలు సరికావు



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న లబ్ధిదారులు

పెంచికల్‌పేట్: దళితబంధు పథకంపై బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు చేస్తున్న ఆరోపణలు సరికావని దళితబంధు లబ్ధిదారులు విమర్శించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ కమీషన్‌లు తీసుకుని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దళిత బంధు ఇచ్చారని అవాస్తవమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గంలో పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దళితబంధు లబ్ధిదారులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాల్వాయి హరీశ్‌బాబు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు.

కౌటాల: దళితబంధు పథకం అర్హులైన నిరుపేదలకే అందించారని తమ వద్ద నుంచి ఎవరూ డబ్బులు ఆశించలేదని మండలంలోని పలువురు దళితబంధు లబ్ధిదారులు మంగళవారం పేర్కొన్నారు. కాగజ్‌నగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించడం సరికాదన్నారు. లబ్ధిదారులు రామిళ్ల చిన్నక్క, గోడిసేల రాజేశ్, భీంరావు, కిశోర్, రాజ్‌కుమార్, ఎర్రోల్ల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: దళితబంధు పథకంలో అక్రమాలు జరిగినట్లు బీజేపీ నాయకులు అసత్యపు ప్రచారం చేయడం మానుకోవాలని దళితబంధు లబ్ధిదారులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వీవీ ప్రసాద్, మాలల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పంబాల సతీశ్, సంజయ్ సింగ్, కౌన్సిలర్లు సునీల్, ఏల్లేష్, జయచందర్, మహేశ్, ఎంఏ వసీం, రాము, హబీబ్ ఖాన్, అశోక్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి సన్మానం



కౌటాల: కోవ లక్ష్మిని సన్మానిస్తున్న నాయకులు

కౌటాల: జిల్లా కేంద్రంలో మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీఎంఎస్ వైస్ చైర్మన్, తుడుం దెబ్బ సంఘం రాష్ట్ర నాయకులు కుమురం మాంతయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోవ లక్ష్మిని ప్రకటించడం హర్షనీయమన్నారు. ఆయన వెంట ఆసిఫాబాద్ ప్యాక్స్ చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఆదివాసీ నాయకులు ధర్మయ్య, చింటు ఉన్నారు.

ప్రత్యేక పూజలు..

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడలో గల శ్రీ భూవమ్మ తల్లి పంజా దేవస్థానంలో సోమవారం రాత్రి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. బంగ్లాలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బంగ్లా నిర్వాహకులు కోవ లక్ష్మిని శాలువాతో ఘనంగా సన్మానించారు. శ్రీకర్, వినోద్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతూ నిరసన



బతుకమ్మతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట రెండోరోజు సమగ్రశిక్ష ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి సమగ్రశిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. సమగ్రశిక్షలో పని చేస్తున్న సీఆర్పీలు, సీసీవో, ఎంఐఎస్ కోర్డినేటర్లు, కేజీబీవీ, యూఆర్ఎస్ ఎస్వోలు, ఏపీవోలుగా పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతన స్కేల్ అమలు, జీవిత బీమా, ఆరోగ్యబీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీరికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు హేమంత్, ఉశన్న, గెజిటెడ్ హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు సుభాష్, కోశాధికారి నగేష్, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేష్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులిస్తాం



మాట్లాడుతున్న కనక యాదవ్‌రావు

వాంకిడి: మండల కేంద్రంలో గ్రంథాలయం కోసం ప్రత్యేక భవన నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేస్తానని జిల్లా గ్రంథాలయాల చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని స్థానిక జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించాలని వెంటనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సరాండి సర్పంచ్ కమలాకర్, వాంకిడి ఉప సర్పంచ్ పవన్ సాయి, బంబార మాజీ ఎంపీటీసీ వినోద్, నాయకులు అశోక్ మహోల్కర్, సత్యనారాయణ చారి, ఎంగలి రాకేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మీసేవ నిర్వాహకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న మీసేవ నిర్వాహకులు

కాగజ్‌నగర్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మీసేవ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్ తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి, డీఏవో వి.ప్రమోద్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ మీసేవలో తొలగించిన పహానీలను పునరుద్ధరించాలని, కమీషన్ పెంచడంతో పాటు ఏఎంసీ పేమెంట్ తొలగించాలని పేర్కొన్నారు. అలాగే మీసేవ కేంద్రాలకు ఉచిత విద్యుత్, ఇంటర్నెట్ సేవలు కల్పించాలని కోరారు. మీసేవ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కె.రాము, సెక్రెటరీ జిషాన్, జుబేర్, మీసేవ నిర్వాహకులు ప్రవీణ్, అజయ్, హరీష్, కిరణ్, రమేశ్, గణేష్ పాల్గొన్నారు.